క్లుప్తంగా

28న చేవెళ్ల తైబజార్ వేలం

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో కొనసాగే వారాంతపు సంత (తైబజారు) 2025–26 సంవత్సరానికి ఈ నెల 28న వేలం నిర్వహించనున్నట్లు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వేయి దరఖాస్తుతో పాటు, నో డ్యూస్ సర్టిఫికెట్, ఏదైన బ్యాంక్‌లో కమిషనర్, చేవెళ్ల మున్సిపల్ పేరు మీద రూ.25వేల డీడీ జతచేయాలన్నారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేవెళ్ల మున్సిపల్‌కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని చెప్పారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రజిత


రజితకు నియామక పత్రం అందజేస్తున్న జ్యోతి

షాద్‌నగర్: మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలిగా పిట్ట రజిత నియమితులయ్యారు. శనివారం నగరంలోని గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జిల్లేడు చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పిట్ట రజితను నియమించారు. అనంతరం ఆమెకు జ్యోతి నియామక పత్రాన్ని అందజేశారు.

నర్సింగ్ కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో కమ్మేకర్ నర్సింగ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ శనివారం మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నర్సింగ్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లేష్‌యాదవ్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి సీలింగ్ ఫ్యాన్‌లు అందజేత

నందిగామ: మండలల కేంద్రమైన నందిగామ శివారులోని పారిశ్రామిక వాడ సమీపంలో పునఃనిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి నందిగామకు చెందిన చెన్నగల్ల సందీప్ సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం అందజేశారు. అనంతరం దాత సందీప్‌ను అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బాల్‌రెడ్డి, లక్ష్మయ్య, అశోక్ గౌడ్, హరిజీవన్, కుమార్ గౌడ్, రాంరెడ్డి, చంద్రపాల్ రెడ్డి, గణేష్, శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో పేదలకు మేలు


సంతాపూర్‌లో బీమా చేయిస్తున్న తపాలా అధికారులు

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్‌లో తపాలశాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత బీమా పైన గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తపాలశాఖ నుంచి వచ్చిన అధికారులు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భీమాను చేయించుకోవాలని తెలిపారు. ఏడాదికి రూ.500తో వ్యక్తిగత భీమాను పొందిన వ్యక్తు లు మరణిస్తే రూ.10 లక్షల బీమా సొమ్మును వారి కుటుంబ సభ్యులకు చెల్లిస్తామని తెలిపారు. నిరుపేదలకు బీమా అండగా ఉంటుందని తపాలశాఖ అధికారులు నందిని, రషీద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని శేరిగూడలో ఇండస్ ఇంటర్నేషన్ స్కూల్, మెడికవర్, రెనోవా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 300మంది గ్రామస్తులు శిబిరానికి వచ్చి, ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. నిర్వాహకులు సామ్యూల్ జోసెఫ్, హర్షిత పోచంపల్లి మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలను అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. శేరిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ఇలాంటివి మరిన్ని చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఇండస్ స్కూల్ విద్యార్థులు ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు అవగాహన కల్పించి, ఉచిత వైద్య శిబిరానికి తీసుకు వచ్చారు. వైద్య సేవల తర్వాత మందులు అందజేసి, అల్పాహారం అందించారు. కార్యక్రమంలో శేరిగూడ మాజీ సర్పంచ్ మైలారం సత్యనారాయణ, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డు నిర్మాణంతో సమస్య

- చెరువును తలపించేలా నిలిచిన వర్షపు నీరు
- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు
- పక్షం రోజుల్లో పరిష్కారం చూపుతామంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు


చెరువును తలపిస్తున్న రహదారి

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్‌లో నిర్మించిన నూతన రోడ్డు కొత్త సమస్యలకు కారణమైంది. బ్రిడ్జీ కింద ఎక్కువ లోతులో తవ్వడంతో ప్రజలు ఇబ్బందికి కారణమైంది. శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికే చెరువును తలపించేలా నీరు నిలిచింది. శనివారం పదోతరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సమస్యను పరిష్కరించాలని అధికారులు నెల రోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కొత్త రోడ్డు నిర్మాణంతో నీటి నిల్వ

ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద ఏడాది క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు పాత రోడ్డును తవ్వి వాహనాల రాకపోకల కోసం కొత్త రోడ్డు నిర్మించారు. వర్షపు నీరు నిలుస్తుందని తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా గాలికి వదిలేశారు. రోడ్డు వేసే సమయంలోనే ఫత్తేపూర్ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. అధికారులు సర్ది చెప్పి చేతులు దులుపుకున్నారు. ఫత్తేపూర్ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌వీఎంఎల్ లాజిస్టిక్స్ కంపెనీల వారి భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డును తవ్వి, నిర్మించి, వారికి లాభం చేకూర్చేందుకే అధికారులు రోడ్డును తవ్వి, కొత్త రోడ్డును నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి.

ముందే స్పందించిన అధికారులు

శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం బృందం గత నెల 25న ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. వర్షపు నీరు నిలిచే అవకాశం ఉందని.. వెంటనే నీరు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించి, మున్సిపాలిటీ నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కమిషనర్ భరోసా ఇచ్చారు. సమీపంలోని తీగలవాగులోకి అంతర్గత కాలువ నిర్మించి నీరు నిల్వకుండా చూడాలని యోచించారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్న ఆర్‌అండ్‌బీ అధికారులు నెల రోజులు దాటినా


అధికారులతో మాట్లాడుతున్న ఫత్తేపూర్‌వాసులు

చోద్యం చూస్తున్నారు. శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి చెరువును తలపించింది. ఇప్పటికైనా అధికారులు నీటి తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు



అధికారులు తీసుకునే అనాలోచిత నిర్ణయాల కారణంగా సామాన్యుడు బలి కావాల్సి వస్తోంది. వర్షపు నీటి నిల్వపై ఇప్పటికే ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నీటి తరలింపునకు శాశ్వత పరిష్కారం చూపేలా చొరవ తీసుకోవాలి.

– ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, శంకర్‌పల్లి

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తాం



ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద పరిస్థితిని ముందే అంచనా వేసి, నెల రోజుల క్రితమే అధికారులంతా కలిసి సంయుక్తంగా పరిశీలించాం. పనులకు కావాల్సిన సహకారం అందిస్తామని చెప్పినప్పటికీ, ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుకు రాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి, 15రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్


చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

షాద్‌నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏబీవీపీ షాద్‌నగర్ నగర కార్యదర్శి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు డిగ్రీ కళాశాల విద్యార్థులతో షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి సరైన కేటాయింపులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు కూడా కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. విద్యా కమిషన్‌కు 20 శాతం నిధులు కేటాయించాలని సూచించినా పట్టించుకోలేదని మండి పడ్డారు. రాష్ట్రంలో చాలా ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడం, సదుపాయాలు లేకపోవడంతో పేద విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, మహేందర్, నవీన్, సాయి, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం


ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు

కొత్తూరు: సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్, హెచ్ఎం ప్రసన్నలక్ష్మీ, రఘుపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాలలు మౌనం వీడాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: మాలలు హక్కులు, అవకాశాలు కోల్పోతున్న మౌనం వహించడం మాలల అస్తిత్వానికే ప్రమాదమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్లలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పెట్టిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని జనాభా ధామాషా ప్రకారం పెంచిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి దళితులను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం 2025 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మాలలను అత్యంత పాశవింకగా మనువాదులు, దోహులుగా కించపరుస్తున్న నోరు మెదపని మాలలు తమ స్వేచ్ఛను కోల్పోయినట్లేనని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన రిజ్వేషన్ల ద్వారా వచ్చే అవకాశాలను కోల్పోతున్న మౌనం వహించడం సరైనది కాదన్నారు. మాల సోదరులు ఇప్పటికైనా ఉద్యమానికి సిద్ధంకావాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేశ్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్

కొందుర్గు: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జిల్లేడ్‌చౌదరిగూడ మండలం వీరన్నపేట, గుర్రంపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు ఆరు వారాలుగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం కూలీలకు 2007లో పనిముట్లు ఇవ్వడం జరిగిందని, ఇప్పటివరకు పనిముట్లు ఇవ్వకపోవడంతో కూలీలే డబ్బు ఖర్చుచేసి పనిముట్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఉపాధిహామీకి సరిపడ నిధులు ఇవ్వకుండా పథకాన్ని నీరుగార్చుతుందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఉపాధి పథకాన్ని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లావణ్య, నవీన్, యాదయ్య, స్వప్న, నర్సమ్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి పనిచేద్దాం

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోవిందమ్మ

శంకర్‌పల్లి: మార్కెట్ అభివృద్ధికి సభ్యులమంతా కలిసి ముందుకు సాగుదామని నూతన చైర్‌పర్సన్ గోవిందమ్మ అన్నారు. శనివారం ఆమె అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో తొలి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. డైరెక్టర్లలంతా ఒకరినొకరు పరిచయం చేసుకుని, వ్యవసాయ మార్కెట్ ని అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం గోవిందమ్మ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి వ్యవసాయం మార్కెట్ ప్రస్తుతం నష్టాలలో ఉందని.. వీలైనంత త్వరగా లాభాల్లోకి తీసుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మార్కెట్‌కి ఉల్లి ఒక్కటే వస్తోందని.. మిగిలిన పంటలు సైతం వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కి సంబంధించిన దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఇతరులకు ఇచ్చి అద్దె ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, సెక్రెటరీ ఐశ్వర్య లక్ష్మి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్


మాట్లాడుతున్న దేవేందర్

షాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న నిర్వహించిన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని.. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ మండల కన్వీనర్ అర్జున్, ఉపాధ్యక్షుడు రవి, సురేష్, చిన్న చంద్రయ్య, రాములు, సాయిల్, యాదమ్మ, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

ఎంపీడీఓ సంధ్య


మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్ రూరల్: తాగునీరు వృథా చేయకుండా జలవనరులను కాపాడాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వాటర్ వర్క్స్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీఓ మాట్లాడుతూ.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని.. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్య సమాజ అభివృద్ధికి సాధనం

- శాస్త్రీయ నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో అనుసంధానం చేయాలి
- అస్సాం ఎన్ఐపీఈఆర్(నైపర్) డైరెక్టర్ డాక్టర్ యూఎస్ఎన్ మూర్తి


అతిథులతో మెడల్స్ అందుకున్న విద్యార్థులు

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: విద్య సమాజ అభివృద్ధికి కీలకమైన సాధనమని అస్సాం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్ ఎడ్యూకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) డైరెక్టర్ డాక్టర్ యూఎస్ఎన్ మూర్తి అన్నారు. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో అనుసంధానం చేయాలని చెప్పారు. కృత్రిమ మేథస్సు, క్లౌడ్ కంప్యూటరింగ్, వ్యాధి ముందస్తు అంచనా, పరిశోధనలు, నమూనా గుర్తింపు వంటి రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రపంచ దృక్పథంతో.. నాయకత్వ లక్షణాలతో.. ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. నేషనల్ క్వాంటం మిషన్, ఔషధ విభాగం, పీఆర్ఐపీ పథకాలకు మద్దతునిచ్చే పరిశోధనలు చేయాలని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన ఏపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు జ్ఞానాన్ని, నైతిక విలువలను, సమాజ సేవ చేసే తత్వాన్ని పంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్‌వీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పరిశోధనలు, సాంకేతికతలను ప్రోత్సహిస్తూ ప్రపంచస్థాయి విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శంకర్‌లింగం, వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ సాత్విక రెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, ఓఎస్‌డీ వీర వెంకటయ్య, డీన్‌లు రాజు, కవిత, సుందర్‌రామ్, క్రిస్టోఫర్, విష్ణువర్ధన్, పవన్‌కుమార్, ప్రత్యూష, పీఆర్ఓ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి


కొలన్ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ మండల నాయకులు

చేవెళ్ల: పార్టీ పటిష్టతకు పనిచేసే ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన కొలన్ ప్రతాప్‌రెడ్డిని శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మచ్చేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా వేసిన గుడిసెలు తొలగించాలి

- అర్హులైన మాదిగలకు పట్టాలివ్వాలి
- ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు అంబేడ్కర్ నగర్ కాలనీ వాసుల వినతి


చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ కాలనీ వాసులు

చేవెళ్ల: మున్సిపరిధిలోని సర్వే నంబర్ 75లో ఉన్న ప్రభుత్వ భూమిలో వేసిన గుడిసెలను తొలగించి అర్హులైన పేద మాదిగలకు పట్టాలు ఇవ్వాలని అంబేడ్కర్ కాలనీ వాసులు కోరారు. శనివారం ఈ మేరకు కాలనీవాసులు ఆర్డీఓ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 75లోని ప్రభుత్వ భూమిని మాదిగలకు అసైన్డ్ చేసిందని ఇందుకు సంబంధించి పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయన్నారు. కొందరు స్వార్థంతో అక్రమంగా ఈ భూమిలో గుడిసెలు వేయించారని ఆరోపించారు. ఈ గుడిసెలు తొలగించి అర్హులైన మాదిగలకు ఇళ్ల పట్టాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు అక్కడ సంచరిస్తుండటంతో కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కె.యాదయ్య, నాయకులు, కాలనీవాసులు బి.శ్రీనివాస్, కె.మానిక్యం, నర్సింలు, వెంకటయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేందర్, సుదర్శన్, బాలు, అశోక్, శివకుమార్, ప్రవీణ్, దయాకర్, వెంకటేశ్, వినోద్, రాజు, సూరి, నరేశ్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

మాపై దాడికి యత్నించి..

- సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం
- భూవివాదంపై విలేకరులతో మాట్లాడిన మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న నరేందర్‌రెడ్డి, రైతులు

షాద్‌నగర్: తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించడతంతో పాటు తమపై దాడికి యత్నించారని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో ఓ వెంచర్‌లో నెలకొన్న భూ వివాదంపై శనివారం మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి రైతులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంసాన్‌పల్లి శివారులో 13 ఏళ్ల క్రితం రైతుల వద్ద 56 ఎకరాలను కొనుగోలు చేసి లక్ష్మీ సిటీ వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించామన్నారు. రెండు రోజుల క్రితం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌కు చెందిన రౌడీలను, మహిళలను, హిజ్రాలను వాహనాల్లో తీసుకొచ్చి తమను భయభ్రాంతులకు గురి చేసినట్లు తెలిపారు. ప్లాట్లకు సంబంధించిన హద్దు రాళ్లు, రోడ్లను జేసీబీలతో ధ్వంసం చేశారన్నారు. ఈ భూమి తమదని ఇక్కడి నుంచి వెళ్ళి పోవాలని మారణాయుధాలతో తమపై దాడికి ప్రయత్నించి, చంపుతామని బెదిరించి అలజడి సృష్టించారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. కొన్నేళ్ళ క్రితమే నరేందర్‌రెడ్డికి తాము భూమిని విక్రయించినట్లు రైతులు లక్ష్మయ్య, రాములు, నర్సింహ, కిష్టయ్య, వీరమ్మ, అంజయ్య, మహేందర్, హకీం, భాస్కర్, సురేష్ కుమార్, జనార్దన్‌చారి, జగదీశ్వర్ తెలిపారు. భూవివాద విషయమై తహసీల్దార్ పార్థసారథిని వివరణ కోరగా.. కంసాన్‌పల్లి గ్రామానికి సంబంధించిన టీపన్ (మ్యాప్) లేదని, గ్రామంలో భూములు రీసర్వే చేసేందుకు చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.